క్లుప్తంగా

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

గంగాధర నెల్లూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనిత అధ్యక్షతన ఎన్నికల కోడ్ కారణంగా సాదాసీదాగా జరిగింది. శనివారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందువలన గతంలో లాగా ప్రజాప్రతినిధులు తమ గళంతో కాకుండా రాతపూర్వకంగా వినతులు సమర్పించాలని ఎంపీడీఓ భాస్కర్ సభ్యులను కోరారు. జెడ్పీటీసీ లక్ష్మీప్రియ, ఎంపీడీఓ భాస్కర్, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

నిండ్ర: మండల సాధారణ సమావేశం ఈ నెల 29న ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భవాని తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఎంపీపీ దీప అధ్యక్షతన ఉదయం 11 గంటలకు మండల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, మండలంలోని ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు నూతన విగ్రహాల ప్రతిష్ఠ



ప్రతిష్ఠించనున్న శ్రీవోందేవి విగ్రహం

నగరి: మున్సిపల్ పరిధి కీళపట్టు చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నూతన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం ఉంటుందని నిర్వాహకులు సుబ్రమణ్యం తెలిపారు. శ్రీవోందేవి, ప్రత్యంగర శరభేశ్వరర్, వరాహి దేవతలను ప్రతిష్ఠించనున్నామన్నారు. శ్రీవోందేవి ఆలయాల్లో అరుదుగా ఉంటుందని ఆదిమహాలక్ష్మి జ్వాల సరస్వతీ శక్తితో కలిసి ఉద్భవించిన దేవతే శ్రీవోందేవి అని విద్యతో పాటు అష్ట ఐశ్వర్యాలను ఒసగే దేవతగా శ్రీవోందేవిని ఆరాధిస్తారని చెప్పారు. ఆ దేవత విగ్రహం తొలిసారిగా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్నామన్నారు.

కాణిపాకంలో తమిళనాడు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ



స్వామి సన్నిధిలో ప్రిన్సిపల్ సెక్రటరీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని శనివారం తమిళనాడు హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అముద కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పూణేకు చెందిన ఇద్దరు ఐఏఎస్ అధికారులు సైతం దర్శించుకున్నారు. వీరికి ఈఓ వెంకటేశ్వర్లు ఘనస్వాగతం పలికి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సిబ్బంది వాసు, రమేష్ పాల్గొన్నారు.

రమణీయం.. పుష్పయాగం



శ్రీవారికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారు జామున ఆలయం ప్రత్యేక పూజలు జరిగాయి. 8గంటలకు శ్రీదేవి,భూదేవి సమేతంగా కోనేటిరాయ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయంలోని ప్రత్యేక కల్యాణ వేదిక్షైకి వేంచేపు చేశారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పరిమళభరిత పుష్పాలు, విశేష పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించి, మహామంగళ హారతులు ఇచ్చారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారుల, భక్తుల కారణంగా తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. కంకణంబట్టార్ ఏకే నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిచెంగ్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వా'కింగ్'

- మారుతున్న జీవన శైలితో నడకకు పెరుగుతున్న ప్రాధాన్యం



వాకింగ్ చేస్తున్న మహిళలు



స్కంధ పుష్కరిణి చుట్టూ వాకర్స్ సందడి

కార్వేటినగరం: ఆరోగ్యమే మహాభాగ్యం అన్నట్లుగా నగర ప్రజలు ప్రత్యామ్నాయ వైద్యంగా వ్యాయామాన్ని ఆశ్రయిస్తున్నారనడంలో అతిశయోక్తి కాదేమో. మారుతున్న జీవన శైలిలో ఆరోగ్యం కోసం వాకింగ్ ఎంచుకుంటున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే పెద్దల మాటను నేడు నగర ప్రజలు అక్షర సత్యంగా పాటిస్తున్నారు. రోజుకు గంట వ్యాయమం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని నమ్మిన ఆరోగ్యాభిలాషులు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీలైతే జిమ్‌లకు వెళ్లడం, యోగా, సైక్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగరంలోని స్కంధ పుష్కరిణి, కళాశాల క్రీడామైదానం, వేణుగోపాల స్వామి ఆలయ మాడవీధులు, జిమ్‌లు ఉదయం సాయంత్రం వేళల్లో కిటకిటకిలాడుతున్నాయి. వృద్ధులు, యువత సైతం పలు ప్రధాన ప్రాంతాల్లో వాకింగ్, వ్యాయామం చేస్తున్నారు. గతంలో పోలిస్తే ప్రస్తుతం వాకింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని వ్యాయామ ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గతంలో రోజుకు 50 నుంచి 70 మంది వాకింగ్ చేసేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 130 నుంచి 180కి పెరిగిందని చెబుతున్నారు. రోజుకు గంట వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందని,ఆలోచనా సామర్థ్యం పెరుగుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

అధిక బరువును తగ్గించుకునేందుకు

ప్రస్తుతం జీవన విధానంలో వచ్చిన మార్పుల కారణంగా జనాభాలో అధిక శాతం మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువత అధిక బరువు కారణంగా చిన్న వయస్సులోనే వ్యాధుల బారిన పడుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్స్, కేకులు, పిజ్జాలు, బర్గర్‌లు, చాట్స్ వంటి జంక్‌ఫుడ్స్‌ను అధికంగా తీసుకోవడం వల్ల ఈ సమస్య వస్తుందని పేర్కొంటున్నారు. అధిక బరువుతో బాధపడుతున్న వారు వాకింగ్ ట్రాక్‌లలో పరుగులు తీస్తుండగా మరి కొందరు యోగా సెంటర్లను ఆశ్రయిస్తున్నారు.

ఆరోగ్య ప్రయోజనాలు ఇవీ

ప్రతిరోజూ నడకతో బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకోవచ్చు. గుండె జబ్బులు, కొలస్ట్రాల్, కీళ్లు, మోకాళ్ల నొప్పులు, ఆందోళన, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు. శారీరక శ్రమతో చిన్నారులను ఆడించడం ద్వారా వారిలో ఎదుగుదల, మానసిక పరిపక్వత, ఏకాగ్రత, పెరుగుతుంది. మంచి ఆలోచనాశక్తి పెరుగుతుంది.

శ్రద్ధ పెరిగింది..

కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి అంశాలలో ప్రజలలో అవగాహన స్థాయి పెరిగింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ ఎక్కువైంది. శారీరక శ్రమతో కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ప్రభుత్వం వివిధ రకాల ఆటల పోటీలను అవగాహనా సదస్సులను నిర్వహిస్తోంది. దీన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవడంలో సఫలీకృతుయ్యారు.

షుగర్ నియంత్రణలో ఉంది..



గత 20 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. రోజూ సాయంత్రం సమయంలో 40 నిమిషాలపాటు నడుస్తున్నాను. షుగర్ నియంత్రణలోనే ఉంది. బలహీనత అంటూ తెలియడంలేదు. ఆరోగ్యంగా ఉంటున్నా. శరీరం చలాకీగా ఉంటోంది.

–విజయకుమార్, కార్వేటినగరం

నిద్ర బాగా పడతుంది



క్రమం తప్పకుండా గత 30 ఎళ్లుగా వాకింగ్ చేస్తున్నా. ఉదయం, సాయంత్రం తప్పకుండా వాకింగ్ చేస్తున్నాను. చలాకీగా ఉంటున్నా.. ఆరోగ్య సమస్యలు లేవు. నడకతోనే ఆరోగ్యం.

–మోహన్‌మురళీ, టీచర్, కార్వేటినగరం

వాకింగ్ తప్పనిసరి



గుండెకు స్టెంట్ వేసిన తరువాత వాకింగ్ తప్పనిరి. గత 20 సంవత్సరాలుగా వాకింగ్ చేస్తున్నా. వాకింగ్ వలన శరీరంలో రక్త ప్రసరణ బాగుంటుంది. మనిషి శక్తిని పుంజుకుంటాడు. ఆరోగ్యంగా ఉంటారు.

–యుగంధర్, ఉపాధ్యాయుడు, కార్వేటినగరం

నడకతో ఆరోగ్యం



రోజుకు గంటన్నర నడకతో మంచి ఆరోగ్యంతో పాటు, శరీర దారుఢ్యం పెరిగింది. నడక రోగాలను దూరం చేస్తుంది. నడక షుగర్, బీపీ నియంత్రిస్తుంది. వైద్యులు కూడా వాకింగ్ తప్పనిసరి అంటున్నారు.

–గంగాధరం, పీఈటీ, కార్వేటినగరం

పిల్లల బాధ్యత తల్లిదండ్రులదే



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: పిల్లల భద్రత, బాధ్యత తల్లిదండ్రులదేనని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర స్పష్టం చేశారు. అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా శనివారం జడ్జి మీడియాతో మాట్లాడుతూ పిల్లలు తమంతట తామే ఇళ్లు వదిలివెళ్లే పరిస్థితిని తల్లిదండ్రులు కల్పించరాదన్నారు. పిల్లలకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తప్పిపోయిన పిల్లలకు సంరక్షణా కేంద్రాలు ఉన్నాయని, తప్పిపోయిన పిల్లలు కనిపిస్తే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరవేయాలని లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ ద్వారా సమాచారం అందజేయవచ్చని వివరించారు. ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

క్షయతో భయపడాల్సిన పనిలేదు



టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: క్షయ వ్యాధితో భయపడాల్సిన పనిలేదని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. శనివారం మండలంలో మూడు బృందాలుగా బీసీసీ టీకాలు వేశారు. బొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో సూపర్‌వైజర్ సుశీల క్షయవ్యాధి నిర్మూలకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా 60 ఏళ్లు ఉన్న వయోజనులకు టీకాలు వేయడం ద్వారా సమాజంలో కొత్తగా క్షయవ్యాధి బాధితుల సంఖ్యను తగ్గించే దిశగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. క్షయ వ్యాధి మరణాల తీవ్రత తగ్గడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం టీకాలు వేశారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా చెల్లెమ్మ తల్లి ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో చెల్లెమ్మ

నగరి: మున్సిపల్ పరిధి కరకంతాపురంలో గ్రామ దేవత చెల్లెమ్మ తల్లి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా జాతర అనంతరం గ్రామ దేవత ఊరేగింపు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు గ్రామ పెద్దలు ఊరేగింపు ఉత్సవాలను అట్టహాసంగా, సంప్రదాయరీతిలో నిర్వహించారు. చెల్లెమ్మ తల్లికి ప్రత్యేక పుష్పాలతో చేసిన అలంకరణలు ప్రజలను అమితంగా ఆకర్షించింది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారిని చూసి భక్తులు మైమరిచిపోయారు. అమ్మవారి ఊరేగింపును పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రమ్స్, నృత్యాలు, వేషధారణ ప్రదర్శన, బాణాసంచా వేడుకలు అట్టహాసంగా సాగాయి. ఇవి ఉత్సవాల్లో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఊరేగింపుగా వచ్చిన గ్రామ దేవతకు మహిళలు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఊరేగింపు ముగిసిన పిదప దేవతను ఆలయానికి చేర్చారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

బంగారుపాళెం: మండలంలో శనివారం రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి చిట్టిబాబు తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు రాయితీ వేరుశనగ విత్తన కాయలు అందజేసినట్లు తెలిపారు. 30 కిలోల బస్తా 1,720 రూపాయలకు విక్రయించినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ పంపిణీ చేస్తామన్నారు. మండలంలోని తిమ్మోజుపల్లె రైతు భరోసా కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు విత్తనాలు పంపిణీ చేశారు.

ఘనంగా వెంకన్న గ్రామోత్సవం



తిరుచ్చిపై ఊరేగుతున్న శ్రీవారు

పుత్తూరు: అప్పలాయగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీవారి గ్రామోత్సవంలో భాగంగా శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీనివాస స్వామిని మేల్కొల్పి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కనుల పండువగా సాగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీరారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో విహరించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి అమ్మవార్లకు మంగళ హారతులిచ్చి ఏకాంత సేవ నిర్వహించారు.

వేసవిలో నోరూరించే ముంజెలు

- ఆరోగ్యం ప్రసాదిస్తున్న తాటి ముంజెలు
- పల్లె జనానికి ఉపాధి



సత్రవాడ వద్ద ముంజెలు విక్రయిస్తున్న వ్యాపారి, (ఇన్‌సెట్) తాటి ముంజెలు

నగరి: మానవాళి కలుషితం చేయలేని తాటి ముంజెలు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. వేసవితాపం నుంచి ఉపశమనం కలిగిస్తాయి. చల్లదనమే కాదు ఆరోగ్యాన్ని కూడా పంచుతాయి. వీటిని చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అన్ని వయసుల వారు ఇష్టంగా తింటారు. ఇవి వేసవిలోనే లభిస్తాయి. మార్కెట్‌లో ముంజెలు కనిపిస్తే చాలు హాట్‌కేకుల్లా అమ్ముడుపోతాయి. ఇందులో నీటిశాతం అధికం. తినడానికి మధురంగానూ, శరీరానికి చల్లదనాన్ని అందిస్తాయి.

ఉపయోగాలకు పెట్టు తాటిచెట్టు

తాటి చెట్లు 30 మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతాయి. రెండు నుంచి మూడు మీటర్ల పొడవు ఆకులను కలిగివుంటాయి. ఈ చెట్లలోని ప్రతి భాగం ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుంది. విత్తనం నాటిన 15 ఏళ్ల తర్వాత చెట్టుకు కాయలు కాస్తాయి. ఈ చెట్లు నీటి అవసరం అంతగా లేని ప్రాంతాల్లోనూ, బీడు భూముల్లోనూ ఏపుగా పెరుగుతాయి. ఈ చెట్టులోని ప్రతి భాగం ప్రజలకు ఏదోవిధంగా ఉపయోగపడుతుంది. పాకలు వేసుకోవడానికి తాటి కలపను దూలాలుగా, వాసాలుగా, స్తంభాలుగా ఉపయోగిస్తారు. తాటినారతో తాళ్లను, ఆకులతో చాపలు, బుట్టలు, విసనకర్రలు, గొడుగులు, టోపీలు తయారు చేస్తారు. తాటి దుంగలు కాలువలపై వంతెనలుగా కూడా ఉపయోగిస్తారు. తాటి ఆకులను పందిరికి, పాకల పైకప్పుకు ఉపయోగిస్తారు. తాటి బెల్లం ఆరోగ్యానికి ఎంతో మంచిదని వైద్యులు చెబుతున్నారు.

సీజన్‌లో పలువురికి ఉపాధి

తాటి ముంజెలు సీజన్‌లో పలువురికి ఉపాధినిస్తోంది. కొందరు జాతీయ రహదారుల్లో అక్కడక్కడా బైఠాయించి విక్రయిస్తున్నారు. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులకు తాటి ముంజెలు తాజాగా అప్పటికప్పుడే తీసి ఇస్తున్నారు. డజను రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు తాటి ముంజెలు విడిగా తీసి వాటిని ఐదేసి ఒక ప్యాకెట్టుగా కట్టి రూ.20 చొప్పున పట్టణ పరిధిలో విక్రయిస్తున్నారు. వీరి వద్ద ముంజెలు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి.

ఎండవేడిని తట్టుకోవాలి

వేసవిలో తాటి ముంజెలు అమ్మడం ద్వారా మంచి లాభాలు ఉంటాయి. అయితే ఎండ వేడిమి తట్టుకోవాలి. పలు ప్రాంతాలకు తిరుగుతూ వ్యాపారం అమ్ముకోవాల్సి ఉంటుంది. తాటి కాయలుగా తీసుకోవడం కంటే విడిగా ముంజెలు కొనుగోలు చేయడానికే జనం ఆసక్తి చూపుతున్నారు. ఐదేసి ముంజెలు వేసి ప్యాకెట్ రూ.20 చొప్పున అమ్ముతున్నాం.

–వేలాయుధం, కుమారమంగళం

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సీజ్ చేసిన బాణసంచా గోడౌన్

కార్వేటినగరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాణసంచా విక్రదారులు, పెట్రోల్ బంకు యాజమాన్యం ఎన్నికల నిబంధనలను తప్పక పాటించాలని మండల తహసీల్దార్ పుష్పకుమారి అన్నారు. శనివారం మండలంలోని చింతతోపు వద్ద ఉన్న బాణసంచా గోడౌన్‌ను సీజ్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమల్లో ఉన్నందున బాణసంచా విక్రయాలను జూన్ 6వ తేదీ వరకు నిలిపివేయాలని ఆదేశించారు. అదేవిధంగా పెట్రోల్ బంకు యాజమాన్యం కూడా వినియోగదారులకు బాటిళ్లలో ఇవ్వ కూడదని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బాణసంచా గోడౌన్‌కు సీల్ వేసి మూయించారు. తహసీల్దార్ వెంట ఎస్ఐ వెంకటక్రిష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నీలావతి, సర్వేయర్ సురేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దొంగల పట్టివేత

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దమిట్టపల్లె గ్రామానికి చెందిన పట్టాభిరెడ్డి మామిడి తోటలో కొంతమంది దొంగతనంగా మామిడికాయలు కోసి విక్రయిస్తుండగా పట్టుబడ్డారు. మామిడి తోట యజమాని పట్టాభిరెడ్డి వారిని పట్టుకుని వివరాలు అడగ్గా దామరగుంట, కృష్ణాపురానికి చెందిన కొంతమంది కాయలను కోసి కొత్తపల్లిమిట్టలోని ఓ మండీలో మూడు రోజులుగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. పోలీసులకు వారిపై ఫిర్యాదు చేస్తామని బాధిత రైతు తెలిపారు.

నేటికీ అంతుచిక్కని ఓటరు నాడి

- పోలింగ్‌ను విశ్లేషిస్తున్న పందెంరాయుళ్లు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే
- ఓటింగ్ సరళిపై ఐవీఆర్‌ఎస్ కాల్స్



చిత్తూరు కార్పొరేషన్: పోలింగ్ ముగిసి 12 రోజులు కావస్తోంది. అయినా ఎన్నికల వేడి తగ్గలేదు. ఫలితాలపై రోజురోజుకూ ఉత్కంఠ పెరుగుతోంది. ఓట్ల లెక్కింపునకు మరో 11 రోజులు ఉండడంతో ఎవరి భవితవ్యం ఎలా ఉండబోతుందోనని అంతా లెక్కలేసుకుంటున్నారు. గతం కంటే ఈసారి పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని అంచనాలు వేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు పందెం రాయుళ్లు కూడా బరిలోకి దిగారు. ఎక్కడెక్కడి ఎవరికి ఓటేశారు? ఎవరు గెలవడానికి అవకాశం ఉంది? అని ఓటర్లను ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా అడుగుతున్నారు. కానీ ఈ కాల్స్‌కు విసుగెత్తిపోయి చాలామంది కట్ చేసేస్తున్నారు. దీంతో పందెం రాయుళ్లకు కూడా జనం నాడీ అంతుచిక్కని పరిస్థితి ఏర్పడింది.

అయోమయంలో పందెంరాయుళ్లు

ఎన్నికలు వస్తే చాలు పందెంరాయుళ్లు బరిలోకి దిగుతారు. ఒకవైపు ఐపీఎల్ క్రికెట్ పందేలు మించి అదే స్థాయిలో ఎన్నికల ఫలితాలపై పందేలకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఎవరి వైపు పందెం కాస్తే బాగుంటుందనే దానిపై ఐవీఆర్‌ఎస్ మాదిరిగా ఓటర్లకు ఫోన్ చేసి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక సమయంలో ప్రజల మనోగతాన్ని తెలుసుకునేందుకు రాజకీయ పార్టీలు ఫోన్ ద్వారా సర్వే చేశాయి. ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థుల అభ్యర్థులను ఎంపిక చేసే ప్రయత్నం చేశారు. ఇక ప్రచార సమయంలోనైతే ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల్ని పెద్ద ఎత్తున విసుగెత్తించారు. ఈ కాల్స్ లిఫ్ట్ చేయలేక ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బంది పడ్డారు. పోలింగ్ అయిపోయాక ఈ కాల్స్ తగ్గాయనుకుంటే పందెం రాయుళ్ల కాల్స్ రావడం ప్రారంభమయ్యాయి.

విసిగిపోయారు

ఐవీఆర్‌ఎస్ మాదిరి కాల్స్‌కు విసుగెత్తిన ప్రజలు ఎన్నికలయ్యాక ఎవరికి ఓటువేశారో తెలుసుకోవడానికి కాల్స్ ఏమిటని విసిగిపోతున్నారు. వివిధ సంస్థలు చేసే కాల్స్‌కు ప్రజలు పెద్దగా సహకరించడం లేదు. మీరు ఏ పార్టీకి ఓటువేశారు, ఎమ్మెల్యే ఓటు ఎవరికేశారు, ఎంపీ ఓటు ఎవరికి వేశారు అని అడుగుతూ అందుకు చెప్పిన అంకెలు నొక్కండి అంటూ కాల్‌లో విసిగిస్తున్నారు. వీటికి అతి కొద్దిమంది మాత్రమే స్పందిస్తున్నారు. చాలా మంది ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కాల్ కట్ చేసేస్తున్నారు. దీంతో ఆయా పందెం రాయుళ్లకు, జనం నాడి చిక్కని పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి అటు అభ్యర్థులకు , ఇటు పందేం కాసే వారికి మరోవైపు ఫోన్ సర్వేపై ఆధారపడిన వారికి స్పష్టత రావడం లేదు. పోలింగ్ ముసిగిన మరుసటి రోజు మంచి అభ్యర్థులు, వారి అమయాయులు బూత్‌ల వారీగా పోలింగ్ ఒరవడిపై విశ్లేషణ చేసుకుంటు న్నారు. ఇందులో భాగంగా ఏయే కేంద్రాల్లో ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. అక్కడెలా ఓటింగ్ జరిగింది. వాటిలో తమ పార్టీకి ఎన్ని ఓట్లు పడి ఉంటాయి. తమ పార్టీకి ఏ మేరకు ప్రయోజనం కలిగిస్తుందని ఆరా తీస్తున్నారు. అన్ని కోణాల్లోనూ ఓటర్లు ఎవరికి ఓటేశారని కూలంకుషంగా లెక్కలు వేసుకుంటున్నారు.

పెరిగిన ఓటింగ్

జిల్లాలో 2019 సార్వత్రిక ఎన్నికలలో ఉమ్మడి జిల్లాలో 31,83,187 ఓట్లకు గాను 23,04,627 ఓట్లు పోలవ్వగా ఓటింగ్ 72.4 శాతం నమోదైంది. కొత్త చిత్తూరు జిల్లా ప్రకారం 87.09 శాతానికి పెరిగింది. పుంగనూరు నియోజకవర్గంలో 86.62 శాతం పోలవ్వగా 2.06 లక్షలు మంది ఓటువేశారు. నగరిలో 87.08 శాతంతో 1.76 లక్షలు, మంది, జీడీ నెల్లూరులో 88.69 శాతంతో 1.81 లక్షలు, చిత్తూరులో 81.24 శాతంతో 1.64 లక్షలు, పూతలపట్టులో 87.66 శాతంతో 1.93 లక్షలు, పలమనేరులో 87.9 శాతంతో 2.35 లక్షలు, కుప్పంలో 89.88 శాతంతో 2.02 లక్షలు ఓట్లు పోలవ్వగా జిల్లా వ్యాప్తంగా 13.62 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్లు వేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏవో

నిండ్ర: వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. ఆయన శనివారం మండలంలోని అగరం, చవరంబాకం గ్రామాల్లో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, రైతులు సస్యరక్షణ చర్యలను తప్పనిసరిగా చేపట్టాలని కోరారు. వేరుశనగ పంటలను ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగుల నివారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.